# మృత్యోర్మా అమృతంగమయ

అక్షరశిల్పి : రాంభట్ల నృసింహశర్మ



ఆధారం :
యోగిని సరోజిని



యోగిని సరోజిని గురుదేవులు

# స్వామి నరసింహయోగి


అనాహత
స్వాధిష్ఠాన
మూలాధార


యోగిని సరోజిని



హిమాలయాలలో యోగిని

ఓం శ్రీరామాయ నమహః

# "మృత్యోర్మా అమృతంగమయ"

**"ప్రియప్రాయా వృత్తిర్వినయ మధురోవాచి నియమః**
**ప్రకృత్యా కళ్యాణీ మతి రనవ గీతః పరిచయః**
**పురోవా పశ్చాద్వా తదిదమవి పర్యాసిత రసం**
**చరిత్రం సాధూనాం మనువధి విశుద్ధం విజయతే"**

అందరినీ ఒప్పించే ప్రవర్తన, వినయ మాధుర్యం తొణికిసలాడే మాటలు, నియమనిబంధనలకు కట్టుబడి వుండే ఆ పలుకుల సరళికి తోడుగా మంగళకరమైన బుద్ధి కూడా వున్నట్లయితే, అలాంటి వారితో పరిచయం కావడానికి పూర్వంగాని ఆ తరువాత గాని వారి చరిత్రలో ఎలాంటి వైపరీత్య వైరశ్యాలూ, వెదకినా కనబడవు. ఆహా సాధుపురుషుల జీవితం అడుగడుగునా పరిశుద్ధమై వుంటుంది కదా! అన్నాడు 'ఉత్తర రామ చరిత్ర' కవి భవభూతి.

ఆ సాధు లక్షణాలన్నీ కలగలసి వెలిసిన ఒకానొక యోగిని చరిత్ర యిది. లౌకిక వ్యవహారలలో ఆ తల్లి పేరు 'సరోజిని' పారమార్థికులకు ఆమె మాతః తాను గమిస్తూ, తనను అనుసరించే వారిని గమనిస్తూ సాగే మాతా సరోజని మార్గం -

**"మృత్యోర్మా అమృతంగమయ"**

✦ ✦ ✦

అది 1938వ సంవత్సరం. జూలై నెల 14 వ తేదీ రాత్రి 12 గం॥ 30 ని॥ల వేళ.... శ్రవణా నక్షత్రం కాంతులీనుతున్న సమయం.

**"యా నిశాస్సర్వభూతానాం తస్యా జాగర్తి సంయమీ**
**యాస్యాం జాగ్రతి భూతాని సానిశా సశ్యతోమునేః "**

అన్నట్లుగా సకల ప్రాణికోటి సుఖభ్రాంతితో నిద్రించే ఆ రాత్రివేళ యోగ తత్త్వమంతా కలిసి ఒక స్త్రీ శిశు రూపాన జన్మించి తన రోదన ధ్వనితో అందరినీ మేల్కొల్పింది. జగతి జాగృతికి ప్రేరకంగా ఈ శిశూదయం జరిగిన స్థలం - పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం. డాక్టర్ క్రొవ్విడి కేశవరావు శ్రీమతి విమలగార్ల ద్వితీయ సంతానంగా, ఆ యింట తొలి ఆడపిల్లగా కళ్ళు తెరిచిన చిట్టి తల్లిపేరు - "సరోజిని".

ఒక అన్నకు చెల్లెలుగా పొందే గారాబుకన్నా, ముగ్గురు చెల్లెళ్ళకు, ఇద్దరు తమ్ముళ్ళకు అక్కగా బాల్యంలోనే తన విధులను

ఆకళింపుచేసుకొని తల్లికి సహాయకారిగా నిలిచేది. అందుకే ఎన్నెన్నో గండాలను దాటి జీవశక్తిని కైవసం చేసుకున్న శైసవం ఆమెది. ఎంతెంతో సాధనతో యోగమార్గాన్ని సుగమం చేసుకో గలిగిన దీక్షాదక్షతలు ఆమెవి.

✦ ✦ ✦

# స్థైర్యాన్ని చాటే శైశవం

మనసు కోతి లాంటిది. త్వరపడడం దాని లక్షణం, స్థిరపరచగలగడమే వివేకం. అందుకు తార్కాణం... ఇప్పుడు ముచ్చటించుకోబోతున్న ఈ సంఘటన.

సరోజిని మూడు నెలల పిల్ల. పిల్లని మంచంమీద పడుకోబెట్టి తల్లి ఇంటి పనుల్లో తలమునకలువుతున్న సమయం. అంతలో ఎక్కడ నుండి వచ్చిందో ఓ కోతి, పిల్లను ఎత్తుకుపోయి చెట్టెక్కే ప్రయత్నం చేస్తోంది. అప్పుడు చూసారు తల్లి విమలగారు. కంగారు పడకుండా తరుణోపాయం ఆలోచించారు. సద్దు చేయకుండా కాసిన్ని అరటి పళ్ళు తీసుకువచ్చి వాటిమీద ఆ కోతి దృష్టి పడేలా చేశారు. అంతే, పాపాయిని తెచ్చి చెట్టు మొదట్లో పెట్టి పళ్ళు తీసుకుపోయిందా కోతి.

మరోసారి, ఓ మందులాళ్ల స్త్రీ బిచ్చంకోసం వచ్చింది. ఎదురుగా ఉయ్యాలలో ఐదు నెలలు పండంటి పాపాయి కనువిందు చేసింది.

అటూ ఇటూ చూసి ఎవరూ కనపడకపోవటంతో ఆ పిల్లని కాస్తా బుట్టలో పడుకోపెట్టి ఎత్తుకుపోయింది. పనులన్నీ చక్కబెట్టుకుని వచ్చిన విమలకు పాప కనబడలేదు. ఇల్లంతా గాభరాగా వెతికేరు. నలుగురికీ సమాచారాన్ని అందించి చుట్టుపక్కలంతా వెతికించారు. ఆస్పత్రిలో వున్న డాక్టర్ కేశరావుగార్కి విషయం తెలిసి కూతురుకోసం పోలీస్ రిపోర్ట్ ఇచ్చి వెతికించారు. చివరకు ఊరి పొలిమేరల్లో గుడ్డ కప్పి తట్టలో సరోజినిని తీసుకుపోతున్న మందులాళ్ళ బిచ్చకత్తెను పట్టుకున్నారు. పాపను తీసుకొచ్చి తల్లిదండ్రులకు భద్రంగా అప్పచెప్పేరు పోలీసులు.

✦ ✦ ✦

## చిన్నప్పటి పెద్దరికం

ఆడేపాడే వయసులో, ఇంకొకరి ఆలనాపాలనలు చూడాల్సిన బాధ్యతను వహించే దిశగా మనసు మళ్ళడమన్నది అనూహ్యం. కాని నాలుగేళ్ళ ప్రాయానికే సాయంచేసే గుణాన్ని పుణికి పుచ్చుకున్న పరిణత మనస్కురాలు సరోజిని.

తల్లి విమలకు టైఫాయిడ్ వచ్చింది. ఇవతల తమ్ముడు నెలల పిల్లవాడు. అర్థరాత్రి అపరాత్రి లేచి ఏడుస్తూంటే ఆ పిల్లవాడిని ఆడించడం, పాలుపట్టడం, మరోవంక తల్లికి కావల్సిన సపర్యలు చేయడం ఇలా, సేవా భావనతో తాను చేవదేరుతూ సహజీవులను సేదదీర్చే ప్రక్రియను నాలుగోయేటినుండే నాంది పలికారు సరోజిని.

అమ్మకు, తమ్ముడికి అన్నీ అమర్చిపెట్టి పూజామందిరం దగ్గర కూర్చుని రామనామాన్ని జపస్తూ తల్లి ఆరోగ్యం కుదుట పడాలని ప్రార్థించేవారు. ఎలాగైతేనేం ఆ తపనకు, ఆ జపనిష్ఠకు ఫలితంగా ఇరవై తొమ్మిది రోజుల తరువాత విమలగారు ఆరోగ్యవంతురాలయ్యారు. కన్న తల్లికేకాదు, తండ్రి దగ్గర చికిత్స తీసుకొనే ఇతరేతర వ్యాధిగ్రస్తుల సేవలో కూడా ముందంజలో వుండే సరోజినిని చూసి సంతోషించని వారూ సంభ్రమాశ్చర్యాలకు లోనుగానివారు లేరంటే అతిశయోక్తి కాదు. ఆ చిన్నారికి ఔదార్యం, సాహసం, సౌశీల్యం, సహనం, పెట్టని ఆభరణాలు, తల్లంటే ఎనలేని ప్రేమ గౌరవం ఆ చిన్నారికి.

1942వ సం॥ ప్రాంతంలో వైద్య సౌకర్యం అంతంత మాత్రంగానే అందే రోజులవి. ఆ చుట్టుప్రక్కల గ్రామాలంతటికీ క్రొవ్విడి కేశవరావుగారు తేతలి సత్యన్నారాయణగారు ఇద్దరే డాక్టర్లు. కేశవరావుగార్కి తెలిసినవారూ, బంధువులూ, కుటుంబాలతో వచ్చి తిష్టవేసి చికిత్సలు పొందుతూ పూర్తిగా నయమయ్యేవరకూ అక్కడే వుండి వెళ్ళేవారు. వారందరికీ అన్నీ అమర్చి పెట్టడంలో అమ్మ పడేయాతన గమనిస్తూండేవారు సరోజిని. చేతనైనంతగా పనిలో పాలు పంచుకొంటూ ఇటు రోగులకు టెంపరేచర్ చూడ్డం, ఓపికగా మందులివ్వటం, కట్లు కట్టేటప్పుడు తండ్రికి సాయం చేయడం వంటివి తన శక్తి మేరకు చేసే ఆ అమ్మాయంటే అందరికీ తలలో నాలుకే. వీటన్నిటి మధ్యలో చదువుకు కూడా అంత ప్రాధాన్యతా వుండేది. మరొపక్క తోడబుట్టిన వాళ్ళతో ఆత్మీయానుబంధం సరేసరి.

"అక్కడ లేనిదే ఇక్కడ రాదు" - అని నానుడి. పూర్వజన్మ సంస్కారం కొంత, పుట్టిన కుటుంబంలోని పుణ్యనేపథ్యం మరికొంత కలగలియడం వల్లనే ఆ జీవి జీవనశైలి ఉత్తమ పథంలో ప్రయాణిస్తుంది. ఉన్నత లక్ష్య శృంగాగ్రాన్ని చేరుకొంటుంది. ఆ దిశగా చూస్తూ సరోజిని తల్లిదండ్రులిద్దరే పరోపకార పరాయణులే. పారమార్థిక చింతనా పారాయణులే.

మనిషిని మంచికి నడిపే ఆచార వ్యవహారాలను తు.చ. తప్పక పాటించే క్రొవ్విడి రామయ్యగారు పశ్చిమ గోదావరి జిల్లా పాందువ్వ గ్రామంలో మోఖాసాదారు ఆవూరి కరణం. రామయ్యగారి మూడవ కుమారుడు క్రొవ్విడి కేశవరావుగారు. డాక్టరుగా చిత్తశుద్ధితో వృత్తి బాధ్యతలు నిర్వర్తించేవారు. డిస్పెన్సరీ నుండి రాగానే, ఆ బట్టలు ఆవల ఒదిలేసి స్నానం చేసి ఇంట్లో అడుగు పెట్టేవారు. తనకు కాస్త నలతగా వుంటే, స్నానం మానేసి జంధ్యం తడుపుకొని లోనికి వచ్చేవారు. బీద రోగులకు ఉచితంగా మందులు ఇస్తూ భోజనం కూడా పెట్టేవారు. వ్యాధిగ్రస్తుల పట్ల వాత్సల్యం, పేదలంటే ప్రేమాభిమానాలు, కళ్ళనిండా కారుణ్యం, ఇదే కేశవరావుగారి మూర్తిమత్వం.

✦ ✦ ✦

## సరోజిని మాతామహుల ప్రాశస్త్యం

ఇక తల్లి విమలగారో! నిడమర్తివారి ఆడబిడ్డ. నిడమర్తి లక్ష్మీనారాయణగారి అమ్మాయి. పద్దెనిమిది పురాణాలను పలుకుబడిలో పెట్టుకున్న పౌరాణిక విదుషీమణి. ఇరుగు పొరుగులకు విజ్ఞాన భాండారం, సలహా సహాయాలందించే నిపుణమతి. అన్నింటినీమించి భర్తవద్ద చికిత్సపొందే రోగుల అన్నార్తికి కళ్ళముందరే వెలసిన కాశీ అన్నపూర్ణ.

అంతటి దంపతుల సంతానంగా పుట్టిన సరోజినికి వారిద్దరి సద్గుణ సంపత్తులూ వంతుల వారీగా వచ్చి చేరడంలో వింత ఏముంది? ఆ మీదట ఆ అమ్మాయికి గల పూర్వజన్మ సంస్కారం కూడా తోడయితే ఇక చెప్పేదేముంది? తల్లి మడిచీర కట్టుకొంటే, సరోజిని మడిగౌను వేసుకోవడం, సీతారామ లక్ష్మణ విగ్రహాలను కడగడం, పూజగదిని శు భ్రం చేయడం, పూలుకోసి పూలసజ్జలో అమర్చడం లాంటి చిన్ని చిన్న పనులు చేస్తూ బాల్యంనుండే భగవత్ కైంకర్య పథంలోకి అడుగు

పెట్టింది సరోజిని. ఈ తరహా జీవనశైలి బాల్య స్థాయినుండే గోచరించడానికి జన్మసంస్కారం కొంతకారణమైతే, కుటుంబ నేపథ్యం, పెంపకమూ మరికొన్ని హేతువులవుతాయి అన్నట్లుగా సరోజిని తల్లి విమలగారి బాధ్యత చాలావుంది. విమల తండ్రిగారి కుటంబ వాతావరణమూ అంత గొప్పదే మరి.

సరోజిని మాతృమూర్తి విమల. ఆమె తండ్రి నిడమర్తి లక్ష్మీనారాయణగారు కొల్లేటి జమీందారుగా చాలా పేరు ప్రఖ్యాతులు గడించిన వ్యక్తి. వారిది విశాలమయిన భవంతి తాము వున్న వూరుకి రోడ్లు వేయించి చెరువులు తవ్వించిన ఉదారుడు. స్వగ్రామంలో శివాలయం కట్టించారు. నిత్య నమక చమక పారాయణలతో నిరంతర శివార్చనా శీలునిగా ఆధ్యాత్మిక పథంలో గమించే పారమార్థికుడు. అన్ని దానాలకన్నా అన్నదానమే మిన్నగా భావించి అన్నబ్రహ్మ స్వరూపాన్ని అందరికీ అందించనిదే ముద్ద ఎత్తని నిరతాన్నదాన వ్రత దీక్షా దక్షుడు. హరిజనులను ఆదుకొంటూ, పర్వదినాలలో వారికి కావల్సిన సంభారాలన్నీ తానే సమకూర్చువారు. తన సరసన వారిని కూర్చోపెట్టుకొని భోజనం చేయడం ఆయన నిత్యవిధి. మూర్తీభూత మానవత్వమే ఆయన. జాలిగుండెగల లక్ష్మీనారాయణగారి సహాయం పొందనివారే లేరు. ఆ పరిసరాలలో ఆయనకు ఐదుగురు సంతానం. మొదట అబ్బాయి, అనంతరం విమల (సరోజిని తల్లి) ఆ తరువాత ముగ్గరు కుమారులు. అల్లుడు కేశవరావుగార్ని మద్రాసు వైద్యకళాశాలలో చేర్పించింది వీరే.

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/kbook.php?id=1502](http://kinige.com/kbook.php?id=1502)**

* * *